సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 21 । జూలై । 2023



సామాన్యుల ప్రాణాలకు సర్కారు అభయం

- 8లో..

ప్రభుత్వ వైద్యంతో సామాన్యుల ప్రాణాలకు సర్కారు అభయమిస్తోంది. మార్కాపురంలో రూ.450 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మిస్తోంది.



వేరువేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య

వేరువేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉరేసుకుని యువకుడు, విద్యార్థి, రైలు కిందపడి దివ్యాంగుడు, మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32.7/27.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఒంగోలు చేరుకున్న హోంమంత్రి



హోం మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలులో నూతనంగా నిర్మించిన పోలీస్ గెస్ట్‌హౌస్‌ను శుక్రవారం హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆమె ఒంగోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ఒంగోలు: ప్రధానమంత్రి యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో (హెచ్‌టీటీపీ://వైఈటీ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ లేదా హెచ్‌టీటీపీ://సోషల్‌జస్టిస్.జీవోవీ.ఇన్/స్కీమ్స్) వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ సాధికారత జిల్లా అధికారి ఎం.అంజల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. పూర్తి వివరాలకు బీసీ సంక్షేమ, సాధికారత అధికారిని సంప్రదించాలని బీసీ సంక్షేమ జిల్లా అధికారి మంజుల సూచించారు.

నారా..గుర్తు చేసుకుంటారా!

సింగపూర్ తరహా ఇళ్లు.. పేపర్ పరిశ్రమ.. వేలాది మందికి ఉద్యోగాలు... ఇదీ నాడు నారా లోకేష్ మార్కాపురం వాసులకు ఇచ్చిన ఘనమైన హామీలు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉండి ఒకే ఒక్కసారి జిల్లాకు వచ్చారు. మార్కాపురానికి వచ్చి సింగపూర్ టెక్నాలజీతో అద్భుతమైన సింగిల్, డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఇస్తాం.. పేపర్ పరిశ్రమ ద్వారా 20 వేల మందికి ఉద్యోగాలిస్తాం.. అంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. ఇవి ఉత్తుత్తి ప్రకటనలుగానే మిగిలిపోయాయి. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆయన మార్కాపురం నియోజకవర్గంలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా నాడు ఆయన ఇచ్చిన హామీలను నియోజకవర్గ వాసులు గుర్తుచేసుకుంటూ నాడు ఇంతన్నాడు..అంతన్నాడు..అనుకుంటూ ఎద్దేవా చేస్తున్నారు.

సింగపూర్ ఇళ్లు.. పేపర్ పరిశ్రమ.. అంతా తూచ్



- రూ.330 కోట్లతో 4,620 మందికి ఇళ్లు
- సింగపూర్ టెక్నాలజీతో నిర్మాణం
- రూ.20 వేల కోట్లతో పేపర్ పరిశ్రమ
- 20 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు
- కోల్డ్ స్టోరేజీ నిర్మాణం
- ఇవీ నాడు మార్కాపురం వేదికగా లోకేష్ ఇచ్చిన హామీలు
- ఒక్కటీ అమలు కాని వైనం



టిడ్కో గృహాలకు శంకుస్థాపన చేస్తున్న లోకేష్ (ఫైల్)

మార్కాపురం టౌన్: అది నవంబర్ 29వ తేదీ 2018వ సంవత్సరం. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా ఉన్న నారా లోకేష్ మార్కాపురం పట్టణానికి వచ్చారు. రూ.333 కోట్ల వ్యయంతో 4,620 మంది పేదలకు సింగిల్, డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. మార్కాపురం నుంచి నాగులవరానికి వెళ్లే దారిలో వీటిని నిర్మిస్తామంటూ ఆర్భాటంగా ఏర్పాట్లు చేశారు. బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సింగపూర్ టెక్నాలజీతో తెలంగాణలో కేసీఆర్ నిర్మిస్తున్న ఇళ్లకంటే గొప్పగా నిర్మిస్తామన్నారు. అంతేకాదండోయ్ షాపూజీ, పల్లంజీ కంపెనీలతో వీటిని నిర్మిస్తున్నామని కూడా ప్రకటించారు. అయితే, ఇక్కడ నిర్మించేది కేవలం 3,600 ఇళ్లు మాత్రమేనని, ఇందుకు తొలి విడతగా రూ.50.16 కోట్ల నిధులు విడుదల చేస్తున్నామని టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించి 912 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదు.


పేదల కలను సాకారం చేస్తున్న సీఎం జగన్...

నాడు లోకేష్ ఉత్తుత్తి హామీలిస్తే నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కలలను సాకారం చేస్తున్నారు. మార్కాపురం పట్టణ శివారులో 7 వేల ఇళ్లు మంజూరు చేశారు. ఇడుపూరు వద్ద రెండు లే అవుట్లలో వేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక లోకేష్ శంకుస్థాపన చేసి వదిలేసిన టిడ్కో గృహ నిర్మాణాల ప్రాంతంలో 492 గృహాలకు స్లాబ్‌లు వేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. రూ.11.76 కోట్లు చెల్లించారు. ఒక్క రూపాయి చెల్లించడం ద్వారా మంచి ఇంటిని ప్రభుత్వమే కట్టించి ఇస్తోంది. మౌలిక వసతులైన రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. ఇక జగనన్న కాలనీలైతే కొత్త గ్రామాలుగా తయారవుతున్నాయి. అక్కడ కొంత మంది గృహ ప్రవేశాలు కూడా చేశారు.

నారా లోకేష్ మార్కాపురం సభలో ఇంకో ఘనమైన హామీ కూడా ఇచ్చారు. మార్కాపురం వద్ద పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామని, డిసెంబర్ 5వ తేదీ 2018వ సంవత్సరంలో రూ.20 వేల కోట్లతో సినార్మస్ కంపెనీతో ఒప్పందం చేసుకుంటున్నామని ప్రకటించారు. దీని ద్వారా జిల్లాలో 20 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఆశ చూపారు. అయితే, కాగితం పరిశ్రమ కాగితాలకే పరిమితమైంది. ఉద్యోగాలు వస్తాయని ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులకు అడియాసే మిగిలింది. వీటితో పాటు కోల్డ్‌స్టోరేజీ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అది కూడా అంతే. జిల్లాలో విస్తారంగా సుబాబుల్ సాగుచేస్తున్నారు. కాగితం పరిశ్రమ లేకపోవడంతో సుబాబుల్ కర్ర మొత్తం భద్రాచలం పేపర్ మిల్లులకు వెళ్లిపోతోంది. ఇక్కడే పేపర్ పరిశ్రమ ప్రారంభించి 20 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని లోకేష్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. దీంతోపాటు మార్కాపురంలో కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. అప్పట్లో మార్కాపురం టీడీపీ నాయకులు పట్టణంలోని దోర్నాల సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని లోకేష్‌తో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే, తాత విగ్రహం వైపు లోకేష్ కన్నెత్తి కూడా చూడలేదు.

విద్యాశాఖకు నకిలీ మకిలి

- ఇద్దరు ఉపాధ్యాయులకు నకిలీ బదిలీ ఉత్తర్వులు జారీ
- కారకులైన ఇద్దరు అధికారులు, ఒక ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు
- తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లరాదంటూ ఏడీకి ఆదేశం
- ఆర్జేడీ నివేదిక ఆధారంగా ఉత్తర్వులు జారీచేసిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్
- జిల్లా విద్యాశాఖలో కలకలం



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

ఒంగోలు: ఇద్దరు ఉపాధ్యాయులకు నకిలీ బదిలీ ఉత్తర్వులు జారీ కావడం, అందుకు కారకులైన ఇద్దరు విద్యాశాఖ అధికారులు, ఒక ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడటం జిల్లా విద్యాశాఖలో కలకలం సృష్టించింది. ఒంగోలులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసలు ఏం జరుగుతోందనే ప్రశ్నకు దారితీసింది. దీనిపై ఆర్జేడీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కారకులైన ముగ్గురిని సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగిందంటే...

ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు వారికి ఉన్న అర్హతలన్నింటినీ ఆన్‌లైన్ చేయడం ద్వారా పాయింట్లు లభిస్తాయి. అత్యధిక పాయింట్లు పొందిన వారికి ఖాళీగా ఉన్న స్థానాల్లో వారు కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తారు. అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో అసిస్టెంట్ డైరెక్టర్, అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ సూపరింటెండెంట్, ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియకు సంబంధించి కంప్యూటర్ సబ్జెక్టుపై అవగాహన ఉన్న ఉద్యోగిని డిప్యుటేషన్ నియామకం చేసుకున్నారు. జిల్లాలో ఈ మొత్తం ప్రక్రియను పరిశీలిస్తే ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి గందరగోళం చెలరేగడంతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పందించారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న పి.రమేష్‌ను హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏం జరుగుతోంది, ఏమైనా లోపాలున్నాయా..? అనేది నివేదిక రూపంలో తెలియజేయాలని గుంటూరు ఆర్జేడీ సుబ్బారావును ఆదేశించారు. డీఈవోగా అదనపు బాధ్యతలను కూడా ఆర్జేడీకే అప్పగించారు.

ఫేక్ ఉత్తర్వుల జారీ ఇలా...

ఉపాధ్యాయులు ఎక్కువగా ముఖ్యమైన ప్రాంతాలను కోరుకుంటుండడంతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో బోధనా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని పోస్టులను ప్రభుత్వం బ్లాక్ చేసింది. తద్వారా అన్ని ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలనేది ప్రభుత్వ నిర్ణయం. అయితే, దీన్ని అవకాశవాదులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. కొన్ని పోస్టులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం బ్లాక్ చేయడంతో వాటిని ఓపెన్ చేయడం అనేది సాధ్యపడదు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వారి అర్హతలను బట్టి స్థానాల కేటాయింపు పూర్తయింది. కానీ, జిల్లాలోని కంభం, బల్లికురవ మండలాల్లోని ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు మాత్రం ఆఫ్‌లైన్ ఉత్తర్వులు అందుకున్నారు. వారు పాత శాలలో జాయిన్ కావడం, అనంతరం వారికి పదోన్నతులు కూడా లభించి హెడ్మాస్టర్లుగా కూడా వేర్వేరు పాఠశాలలకు వెళ్లిపోవడం జరిగిపోయాయి.

జాయినింగ్ రిపోర్టుల్లో కనిపించిన వ్యత్యాసం...

ఆన్‌లైన్‌లో బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారి సంఖ్యకు, నూతన స్థానాల్లో జాయిన్ అయిన వారి సంఖ్యకు మధ్య ఇద్దరు పెరిగినట్లు ఆర్జేడీ దృష్టికి వెళ్లింది. దీంతో వాటన్నింటినీ పరిశీలించగా కంభం, బల్లికురవ మండలాల్లోని వారికి పోస్టింగ్‌లు ఎలా వచ్చాయనేది అర్థంగాక ఆ పోస్టులకు సంబంధించిన కాపీలను తెప్పించుకుని పరిశీలించారు. ఆ స్థానాలు బ్లాక్ చేసినట్లుగా ఉండటంతో వాటిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ సాంకేతిక సిబ్బందితో మాట్లాడారు. దీంతో నకిలీ ఉత్తర్వులుగా వెల్లడైంది. ఈ విషయాన్ని తన నివేదిక ద్వారా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఆర్జేడీ పంపించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన వేరే వారి ఉత్తర్వుల పీడీఎఫ్ కాపీని వర్డ్‌లోకి మార్చి అందులో ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లను టైప్‌చేసి మళ్లీ దానిని పీడీఎఫ్‌లోకి కన్వర్ట్ చేసి ఉత్తర్వులు సిద్ధం చేసినట్లుగా పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉదయభాస్కర్, సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.సురేష్, డిప్యుటేషన్‌పై విద్యాశాఖ కంప్యూటర్ కార్యాలయంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ గిరి అందుకు బాధ్యులని తేల్చి వారిని సస్పెండ్ చేశారు.

ఉన్నతాధికారి ఆదేశాలతోనే ఇదంతా..?

ఈ వ్యవహారంపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జిల్లాలో పనిచేసిన ఒక ఉన్నతాధికారి ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఆదేశాలతోనే నకిలీ బదిలీ ఉత్తర్వులు తయారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సస్పెండైన అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉదయభాస్కర్.. వెంటనే తన బాధ్యతలను మరో అసిస్టెంట్ డైరెక్టర్ వై.వాణి సురేఖకు అప్పగించడంతో పాటు తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా కేంద్రం వదిలి వెళ్లకూడదని ఆదేశించారు. దీన్నిబట్టి ఈ వ్యవహారంపై పాఠశాల విద్యాశాఖ ఎంత సీరియస్‌గా వ్యవహరించనుందో స్పష్టమవుతోంది. ఈ కేసు విచారణను వేగవంతం చేయడం ద్వారా సస్పెండ్ అయిన ముగ్గురి వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం మరికొంతమందిని విచారించే అవకాశం కనిపిస్తోంది. కంప్యూటర్ సాయంతో ప్రభుత్వ ఉత్తర్వులను కాపీచేసి అందులో పేర్లు మార్చి మరొకరికి అందించడం అంటే ఫోర్జరీ కింద పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసే అవకాశం కూడా లేకపోలేదనే విద్యాశాఖ వర్గాల్లో చర్చ వినిపిస్తోంది. ఈ వ్యవహారం ఇంకెంతవరకు దారితీస్తుందనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది.

స్థానికేతరుల హంగామా..!

- ముఖాముఖిపై ఆ రెండు సామాజికవర్గాల నిరాసక్తి
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా జనం ఒక రహదారివైపే
- లోకేష్ కనిగిరి పాదయాత్రలో ఏరులై పారిన మద్యం



లోకేష్ సభకు పలుచగా హాజరైన జనం(డ్రోన్‌షాట్)

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర, బహిరంగ సభ ఆద్యంతం స్థానికేతరుల మధ్యే సాగింది. బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి భారీగా వాహనాల్లో కనిగిరి తరలివచ్చి హంగామా చేయగా.. గురువారం కొండపి, అద్దంకి, సింగరాయకొండ, బాపట్ల నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను తరలించి పాదయాత్ర, బహిరంగ సభలో హడావిడి చేశారు. వాస్తవానికి కనిగిరిలో ఇటీవల జరిగిన టీడీపీ బస్సు యాత్ర అట్టర్ ఫ్లాప్ అయింది. స్థానిక నాయకులు ఎవరూ సహకరించలేదన్నది బహిరంగ రహస్యం. ఈ విషయంపై పార్టీ అధిష్టానం నుంచి స్థానిక మాజీ ఎమ్మెల్యే ఉగ్రపై తీవ్ర అసంతృప్తి వెల్లడైంది. దీంతో ఆయన ఈసారి స్థానిక నాయకుల కంటే స్థానికేతరులపై ఎక్కువ నమ్మకాన్ని పెట్టుకుని ఆ దిశగా ప్రయత్నాలు చేశారు. అలాగే జిల్లా పార్టీ నేతలు సైతం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులను కనిగిరి తరలించారు.

రాత్రి నుంచే జిమ్మిక్కులు...

వాస్తవానికి కనిగిరి పట్టణంలోనే అత్యంత పెద్దది చర్చి సెంటర్ రోడ్డు. ఆ రోడ్డులో మూడు వైపులా.. దారులు వెడల్పుగా ఉంటాయి. గతంలో అక్కడ జరిగిన ఇతర పార్టీ సభలకు జనం కిక్కిరిస్తూ ఇసుక రాలనంతగా వచ్చారు. కానీ, లోకేష్ సభకు అదే తరహాలో జనం వచ్చే పరిస్థితి కనిపించలేదు. దీంతో రాత్రి నుంచే టీడీపీ నేతలు జిమ్మిక్కులు మొదలు పెట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలను మూసుకుపోయినట్టు కట్టారు. అంతేగాకుండా ఆర్‌అండ్‌బీ రోడ్డును సుమారు 5 అడుగులు వెలుపలకువచ్చి.. రోడ్డు మరీ ఇరుకుగా మార్చేందుకు గుంతలు తీశారు. కేవలం డ్రోన్ షాట్‌ల కోసమే రోడ్డను మూసి జనం బాగా వచ్చారనే విధంగా చూపే ప్రయత్నం చేశారు. అన్ని జిమ్మిక్కులు చేసినా చివరకు భయపడి పామూరు రోడ్డువైపే బహిరంగ సభ రథం ముఖం పెట్టి లోకేష్ చేత మాట్లాడించారు. దీంతో కనిగిరి-డిపో రోడ్డు, కనిగిరి-పాదిలి రోడ్డులు జనం లేక వెలవెలబోయాయి. అంతేగాకుండా దుకాణాలకు అడ్డంగా ఫ్లెక్సీలు కట్టడంతో పూలు, పండ్ల చిరువ్యాపారులు రోజంతా నడిరోడ్డుపై వ్యాపారం చేసుకున్నారు. కొందరు రోజు కూలి వారు ఉసూరుమంటూ శాపనార్థాలు పెట్టారు.

ముఖాముఖికి నిరాసక్తి..?

వాస్తవానికి పట్టణంలోని రెండు ప్రధాన సామాజిక వర్గాలతో పాటు మరో సంఘంతో నారా లోకేష్ ముఖాముఖి కార్యక్రమం గురువారం బహిరంగ సభకు ముందుగానే జరుగుతుందని విస్తృత ప్రచారం జరిగింది. కానీ, ఆ కార్యక్రమం జరగలేదని తెలిసింది. లోకేష్‌తో ముఖాముఖిలో పాల్గొనేందుకు ఆ రెండు సామాజికవర్గాలకు చెందిన వారు ఆసక్తి చూపలేదని తెలిసింది. అంతేగాకుండా ఆ రెండు సామాజికవర్గాలకు చెందిన టీడీపీలోని ప్రధాన నేతలు కూడా అందుకు ముందుకు రాలేదని విశ్వసనీయంగా తెలిసింది.

ఏరులై పారిన మద్యం...

నియోజకవర్గంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న లోకేష్ పాదయాత్ర బహిరంగ సభలకు మద్యం ఏరులై పారుతోంది. ప్రధానంగా పాదయాత్రలో పాల్గొన్న మహిళలకు రూ.500, పసుపు చీర అందజేయగా, మగవారికి టీ షర్ట్, రూ.400 నగదు, క్వార్టర్ బాటిల్ ఇచ్చినట్లు తెలిసింది.

సభలో ఎన్టీయార్‌ను కీర్తిస్తూ.. ఎదురుగా ఉన్న విగ్రహాన్ని పట్టించుకోకుండా..!

పీసీ పల్లి: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు ప్రస్తావన లేకుండా నారా లోకేష్ ప్రసంగం ఉండదు. కనిగిరిలో నిర్వహించిన సభలో సైతం ఆయన ప్రస్తావన తెచ్చారు. అయితే, చింతారెడ్డిపాలెం నుంచి కనిగిరి పట్టణంలోకి పాదయాత్ర వస్తున్న సమయంలో పామూరు బస్టాండ్ సెంటర్‌లో ప్రసంగించారు. అభిమానులచేత క్రేన్ సాయంతో భారీ దండ వేయించుకున్నారు. ఎదురుగా కనిపిస్తున్న నిలువెత్తు ఎన్టీయార్ విగ్రహాన్ని కనీసం పట్టించుకోలేదు. రామారావు విగ్రహానికి పూలమాల వేసి గౌరవిద్దామన్న జ్ఞానమన్నా లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా..పార్టీ సీనియర్ నేతలు సైతం లోకేష్ తీరుపై నిరుత్సాహానికి గురయ్యారు.

రైతుల విద్యుత్ కష్టాలకు చెక్



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యనారాయణ

దర్శి: రైతుల విద్యుత్ కష్టాలను అధిగమించి 9 గంటల పాటు కోతలు లేని విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని విద్యుత్‌శాఖ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద జిల్లాకు రూ.110 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. టెండర్లు పూర్తి చేసి డిసెంబర్ నాటికి పనులు కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు జిల్లాలో 2000 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయని, దర్శి డివిజన్ పరిధిలో 862 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్లకు డబ్బు చెల్లించారని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి సర్వీసు కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి 70 శాతం కనెక్షన్లు ఇచ్చామని, మరో 30 శాతం వివిధ కారణాల వలన ఆగిన వాటిని వారితో మాట్లాడి పునరుద్ధరిస్తామని తెలిపారు. రేంజ్ వైజ్‌గా ఆగిపోయిన విద్యుత్ బకాయిలకు రూ.20 వేలలోపు ఏఈఈ, రూ.20 వేల నుంచి రూ.50 వేలలోపు ఏడీ, రూ.50 వేలపైన ఉన్న బకాయిలను డీఈల ద్వారా వసూలు చేస్తున్నామన్నారు. ప్రతి సబ్‌స్టేషన్ నుంచి వ్యవసాయ ఫీడర్లు సపరేట్ చేసి రైతులకు 9 గంటల నిరంతరం విద్యుత్ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ అందించి గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల పాటు కోతలు లేని కరెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు లేకుండా అక్కడికక్కడే ఇండస్ట్రీలు ఏర్పాటు చేసుకునేందుకు విద్యుత్ అందిస్తామన్నారు. మండల, జిల్లా కేంద్రాలకు వలసలు తగ్గుతాయని చెప్పారు. కురిచేడు మండలం కల్లూరు, ముండ్లమూరు మండలం పెద్ద ఉల్లగల్లుకు 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం స్థల సేకరణలో ఉన్నామన్నారు. విద్యుత్ వినియోగదారులకు తీరని సమస్యలు ఉంటే 1912 నంబర్‌కు కాల్ చేయాలని, డివిజన్ పరిధిలోని 9440812244 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ కరీం, ఏడీ పిచ్చయ్య, ఏఈఈ ప్రసాద్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- 24 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వీసుల్లోకి వచ్చిన ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల్లో కారుణ్య నియామకం కోటా కింద జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉద్యోగాలకు నియమితులైన వారికి గురువారం నియామక ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఉద్యోగాలు చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు విద్యార్హతలను బట్టి 24 మందిని వివిధ పోస్టుల్లో కారుణ్య నియామకం కింద నియమించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, కలెక్టరేట్ ఏవో కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జగనన్న సురక్ష సూపర్ సక్సెస్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పక్కన ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు, కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్రంలో సూపర్ సక్సెస్ అయిందని, ఇది దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి ప్రజల నుంచి అనేక విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వాటిలో ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన అంశాలు ఉన్నాయన్నారు. విద్యా సంస్థల ప్రారంభ సమయంలో విద్యార్థులు ఈ ధ్రువీకరణ పత్రాల కోసం పెద్ద ఎత్తున తహసీల్దారు కార్యాలయాలకు, మీ సేవ సెంటర్లకు వెళుతున్నారని తెలుసుకుని ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అంతేగాకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో కలిపి మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించడం జరిగిందన్నారు. జూలై 1 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో కేవలం రెండువారాల్లోనే 10,704 సచివాలయాల పరిధిలో 27,32,866 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 24,46,599 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3,159 ఓబీసీ సర్టిఫికెట్లు, 5,199 కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు జారీ చేసినట్లు జంకె వివరించారు. మొత్తం 57.03 లక్షల మంది ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. జూలై 18న ఒక్కరోజే ఏకంగా 6,87,863 సర్టిఫికెట్లు జారీ అయ్యాయన్నారు. వీటితో పాటు సంక్షేమ పథకాలు, డాక్యుమెంట్/సర్టిఫికెట్ జారీ, ఫోన్‌కు ఆధార్ లింకేజీ వంటి అనేక సేవలను వలంటీర్లు అందించారన్నారు.

చారిత్రక నిర్ణయం : గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చారిత్రక నిర్ణయం తీసుకుని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నగర కన్వీనర్ కటారి శంకర్, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిద్దలూరులో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఒంగోలు హైవే రోడ్డు సమీపంలోని పద్మావతి గార్డెన్‌లోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి జరగ్గా.. గురువారం వెలుగులోకి వచ్చింది. వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో దుండుగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాతెరచి రూ.35 వేలు నగదు, జత కమ్మలు, దుస్తులు అపహరించుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన ప్రదేశంలో క్లూస్ టీమ్ సహాయంతో సమగ్రవిచారణ చేపట్టారు. యజమాని వెంకటేశ్వరరెడ్డిని పోలీసులు ఫోన్‌లో సంప్రదించి పూర్తి వివరాలను సేకరించారు. పట్టణ శివారు ప్రాంతంలో నివాసం ఉండే వారు తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మహేష్ సూచించారు.

యువకుడి హత్యపై కేసు నమోదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

టంగుటూరు: సొంత బావనే కత్తితో పొడిచి హత్య చేసిన ఘటనలో నిందితుడిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. టంగుటూరు మండలం కందుకూరు గ్రామంలో బుధవారం రాత్రి పసుమర్తి ఆశ్వీర్వాదం(25) అనే యువకుడిని అతని బావమరిది గొల్లపూడి లాజర్ కత్తితో పొడవడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో బేల్దారి మేస్త్రీ వద్ద అప్పుగా ఇప్పించిన రూ.30 వేలు ఇవ్వకపోవడం, చెల్లెలిని కొట్టి వేధించిన విషయాలపై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మృతుడి భార్య అఖిల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒంగోలు జీజీహెచ్‌లో ఆశీర్వాదం మృతదేహాన్ని సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యార్థి బలవన్మరణం

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు కొత్తూరులో 8వ తరగతి చదువుతున్న షేక్ జగన్(14) బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ హసన్, హుస్సేనమ్మలకు ఇద్దరు సంతానం. అందులో పెద్ద కుమారుడు బ్రహ్మేంద్రరావు త్రిపురాంతకం వద్ద బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు పవన్ ముండ్లమూరులో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తల్లి హుస్సేనమ్మ మానసిక వ్యాధితో బాధపడుతూ ఎక్కడపడితే అక్కడ ఉంటూ జీవనం సాగిస్తుంది. తండ్రి బేల్దారీ పనులు చేస్తుంటాడు. జగన్ సక్రమంగా స్కూలుకు వెళ్లకుండా ఇంటి దగ్గర తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం జగన్ రోడ్డుపై మద్యం తాగుతూ కనిపించడంతో తండ్రి మందలించడంతో ఇద్దరి మధ్య వాదనలు జరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన జగన్ బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సామాన్యుల ప్రాణాలకు సర్కారు అభయం

టీడీపీ జమానాలో సర్కారు దవాఖానా అంటేనే జనం బెంబేలెత్తిపోయే దుస్థితి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లిన వారికి అక్కడ ఎదురైన చేదు అనుభవాలు గుర్తు చేసుకుంటే గుండె తరుక్కుపోతుంది.! వైద్యులు, సిబ్బంది సరిపడినంత మంది లేకపోవడం, అరకొరగా మందులు, అంబులెన్సుల కొరత కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన దరిమిలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రభుత్వ ఆస్పత్రులకు జవసత్వాలొచ్చాయి. క్షేత్ర స్థాయిలో నూతనంగా హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయడంతోపాటు అన్ని రకాల ఆస్పత్రులను నవీకరించేందుకు సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల క్రితమే నడుం బిగించారు. ఈ పరిణామాలతో పశ్చిమ ప్రకాశం మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటోంది.

మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న మార్కాపురం

- 450 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీ నిర్మాణం
- టీడీపీ జమానాలో వైద్య రంగం నిర్వీర్యం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రులకు జవసత్వాలు
- జిల్లా వైద్యశాలలో ముమ్మరంగా డయాలసిస్ సేవలు
- కిడ్నీ బాధితులకు నెలనెలా రూ.10 వేల పింఛను
- 104 అంబులెన్సుల్లోనే కిడ్నీ బాధితుల రాకపోకలు

మార్కాపురం:

పశ్చిమ ప్రకాశం ప్రధాన కేంద్రమైన మార్కాపురం వైద్య సేవలకు సరికొత్త చిరునామాగా నిలిచే రోజు త్వరలోనే రాబోతోంది. మార్కాపురంలో రూ.450 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తుండటమే అందుకు కారణం. పశ్చిమ ప్రకాశం ప్రజలు ఆపద సమయంలో పెద్దాసుపత్రికి వెళ్లాల్సి వస్తే నంద్యాల, కర్నూలు, గుంటూరు, ఒంగోలు తదితర పట్టణాలే దిక్కు. వ్యయప్రయాసలకోర్చి అంత దూరం వెళ్లినా ప్రాణాలు దక్కక మృతదేహాలతో స్వగ్రామాలకు తిరిగొచ్చిన సంఘటనలున్నాయి. ఈ పరిస్థితిని సమూలంగా మార్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాలని నిర్ణయించి శరవేగంగా అడుగులు వేస్తోంది.

నాడు ప్రాణం దైవాదీనం..

టీడీపీ ప్రభుత్వంలో వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. మార్కాపురం జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులు భర్తీ చేయకపోవడం, మందుల కొరత తీర్చకపోవడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిశాయి. ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ నీరు తాగి కిడ్నీ జబ్బు బారిన పడిన వారు మెరుగైన వైద్యం లభించక అర్ధంతరంగా ప్రాణాలు వదిలేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో కిడ్నీ బాధితులకు అండగా చేసిన పోరాటాల ఫలితంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం కనిగిరి, మార్కాపురంలో వైద్యశాలల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసింది. అయితే పూర్తి స్థాయిలో డాక్టర్లను నియమించకపోవడం, వైద్య పరికరాలు లేకపోవడం, మందుల కొరతతో డయాలసిస్ కోసం వచ్చిన వారు నానాఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ తరుణంలో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగాన్ని ప్రక్షాళన చేశారు. డయాలసిస్ పేషెంట్లకు నెలకు రూ.10 వేల పింఛను ఇవ్వడంతోపాటు, వారు డయాలసిస్ కోసం వైద్యశాలకు వచ్చేందుకు 104 అంబులెన్స్‌ను వినియోగించుకునే అవకాశం కల్పించారు. ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడకుండా వెలిగొండ జలాలను అందించేందుకు గొట్టిపడియ వద్ద ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే సుమారు 200 మందికి పైగా వైద్యుల సేవలు, ఆధునిక వైద్య పరికరాలు, మందులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం మార్కాపురం జిల్లా వైద్యశాలలో 81 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రతినెలా ప్రభుత్వం పింఛను ఇస్తోంది. డయాలసిస్ వార్డుకు నేరుగా నీటి సౌకర్యాన్ని కల్పించారు.



డయాలసిస్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



మార్కాపురం జిల్లా వైద్యశాల

మార్కాపురంలో జిల్లా వైద్యశాలలో సేవల తీరు..

వివరాలు	టీడీపీ జమానాలో..	వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..
డాక్టర్ల సంఖ్య	9	33
బెడ్లు	70	100
సర్జరీలు	6(నెలలో)	50 (నెలలో)
డెలివరీలు	140-150 (నెలలో)	275-300 (నెలలో)
ఈఎన్‌టీ సేవలు	0	50కి పైగా
వైద్య సిబ్బంది	25	47
ఐసీయూ బెడ్లు	0	10
ఆక్సిజన్ ప్లాంట్లు	0	3
108 వాహనాలు	3	6
104 వాహనాలు	1	3
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు	2	6
డయాలసిస్ పింఛను	0	రూ.10 వేలు
వీఆర్‌డీఎల్ ల్యాబ్	0	1
సైక్రియాటిక్ సేవలు	0	1
శానిటేషన్ సిబ్బంది	14	32
సెక్యూరిటీ గార్డులు	8	16
మొత్తం సిబ్బంది	180	249

దయాలసిస్ రోగులపై ప్రత్యేక దృష్టి



జిల్లా వైద్యశాలలో ప్రస్తుతం 81 మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. 70 మందికి ప్రతి నెలా రూ.10 వేల రూపాయలు పింఛను వస్తోంది. మిగతా వారికి కూడా వచ్చే నెల నుంచి పింఛను అందే అవకాశం ఉంది. వైద్య సేవల పరంగా డయాలసిస్ వార్డుల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇద్దరు డాక్టర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, 1 టెక్నీషియన్ డయాలసిస్ వార్డులోనే ఉండి సేవలందిస్తున్నారు.

– డాక్టర్ సుబ్బారెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్

మంచి వైద్యం అందుతోంది



మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలోని డయాలసిస్ కేంద్రంలో మంచి వైద్యసేవలు అందుతున్నాయి. ఇప్పటికి రెండుసార్లు వచ్చి డయాలసిస్ చేయించుకున్నా. ఎటువంటి ఇబ్బందీ లేదు. ఇక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది దగ్గరుండి బాగా సేవ చేస్తున్నారు.

– గూడూరి ప్రసాద్, తువ్వపాడు, కొనకనమిట్ల మండలం

ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు



మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో డయాలసిస్ చేయించుకుంటున్నా. ఇప్పటికి రెండు సార్లు పూర్తయింది. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్లు మమ్మల్ని పరీక్షించి మందులివ్వడంతోపాటు ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ధైర్యంగా ఉన్నా.

– వల్లంపాటి లక్ష్మిదేవీ, కంభం

మాతా శిశు సంరక్షణ బాధ్యతాయుతమైంది

- జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్



మాతా శిశు సంరక్షణపై వర్క్‌షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: మాతా శిశు సంరక్షణ ఎంతో బాధ్యతాయుతమైందని ఆ దిశగా నర్సులు, మిడ్ లెవల్ ప్రొవైడర్‌లు అవగాహనతో పనిచేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ అన్నారు. మాతా శిశు సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించేలా నూర్ హెల్త్, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జీజీహెచ్‌లో భగవాన్ నాయక్‌ప్రారంభించారు. దీనికి కేర్ క్యాంపెయిన్ అసోసియేట్ డాక్టర్ వాసవీ వర్క్‌షాప్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ తల్లి బిడ్డలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పూర్తిగా అవగాహన చేసుకుని వారికి వివరించి చెప్పాలన్నారు. అందుకోసం ఇన్ఫర్‌మేటివ్ చార్టులు, పలు రకాల మాధ్యమాలను వినియోగించి అర్ధమయ్యేలా తల్లులకు వారి కుటుంబసభ్యులకు తెలపాలన్నారు. ఏపీ రిసోర్స్‌పర్సన్ పి.గోపి మాట్లాడుతూ తల్లులకు వారి సహాయకులకు పౌష్టికాహారం, ఏ సమయంలో ఏ పరీక్షలు చేయించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా కూడా సమాచారం లభ్యం అవుతుందని తెలిపారు. రెండు రోజుల్లో సుమారు 300 మందికి హెల్త్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ నర్సింగ్ సూపరింటెండెంట్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



నరహరి భూమియా మృతదేహం

మద్దిపాడు: ఉరేసుకొని ఒడిశాకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే..మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీలో కోరాపుట్ జిల్లా ఒడిశాకు చెందిన నరహరి భూమియా (23) హెల్పర్‌గా రెండు నెలల క్రితం పనిలో చేరాడు. బుధవారం సాయంత్రం మద్యం సేవించి రూమ్‌కు వచ్చి భోజనం చేశాడు. రూంలోని మిగిలిన వారంతా నిద్రించేందుకు పైకి వెళ్లగా..భూమియా అర్ధరాత్రి సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం కిందకు వచ్చి గమనించిన కుటుంబసభ్యులు ఫ్యాక్టరీ యజమానికి తెలియజేయడంతో ఆయన వెంటనే మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించారు. మద్దిపాడు ఏఎస్సై రమేష్ కృష్ణ సమక్షంలో తలుపు పగులగొట్టి యువకుని కిందకు దించారు. అనంతరం యువకుని స్నేహితులు, బంధువులు పక్కన ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వారిని విచారించగా యువకునికి ఎటువంటి వివాదాలు లేవని తెలిపారు. యువకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తలరించారు. యువకుని తల్లిదండ్రులు నిరుపేదలని, వారికి ఇక్కడకు రావడానికి కూడా ఖర్చులకు డబ్బు లేదని యజమానికి వివరిండంతో ఆయన పెద్ద మనసుతో ఆ యువకుని మృతదేహాన్ని వారి స్వగ్రామం పంపడానికి ఏర్పాటు చేశారు. మద్దిపాడు ఏఎస్సై రమేష్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమైందని దివ్యాంగుడు..



నాగేశ్వరరావు మృతదేహం

లక్ష్మీపురం: ప్రేమ విఫలం కావడంతో దివ్యాంగుడు బ్రాడీపేటలోని రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన సనగల నాగేశ్వరరావు (35) కొంతకాలంగా బ్రాడీపేటలోని అంధుల ఆశ్రమంలో ఉంటున్నాడు. అక్కడ పరిచయమైన దివ్యాంగురాలితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ప్రియురాలు గత కొన్ని రోజులుగా ఫోన్ ఎత్తకపోవడంతో మనస్తాపంలో నాగేశ్వరరావు బుధవారం బ్రాడీపేటలోని రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు రక్షించి స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంటూరు మీదుగా గిద్దలూరు రైలు ఎక్కించి నాగేశ్వరరావు స్వగ్రామమైన రాచర్ల పంపించారు. నాగేశ్వరరావు గురువారం తిరిగి గుంటూరు వచ్చి బ్రాడీపేట 1/14వ లైనులో అటుగా వచ్చే ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా మృతుడు నాగేశ్వరరావు బ్రాడీపేటలోని అంధుల ఆశ్రమంలో ఉంటున్నట్లు తెలిసింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిపి, జీఆర్పీ పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు.

మనోవేదనతో కూలీ..



తీవ్రగాయాలతో పడిఉన్న శివ

గిద్దలూరు రూరల్: రైలు కింది పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగింది. నంద్యాల జీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఎస్.బయనపల్లె గ్రామానికి చెందిన మీసాల శివ(35) అనే కూలీ పనులు చేసుకుని జీవించే వ్యక్తి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు కిందపడిన శివను గమనించిన రైల్వే సిబ్బంది చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో సేవలు మరింత చేరువ

- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- ఐనముక్కలలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ సేవలు చేరువ చేయడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఐనముక్కలలో గురువారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసిన జగనన్న వాటి పరిష్కారానికి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి మెరుగైన సేవలందిస్తున్నారని వివరించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సత్వర సేవలు అందుతుండటంలో మిగిలిన రాష్ట్రాలు సైతం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు సుముఖత చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అవ్వాతాతలకు పెన్షన్ మంజూరు చేయకుండా వేధించారని, నగదు ఇవ్వడానికి రోజుల తరబడి తిప్పిన విషయాలను గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులకు పింఛన్లు మంజూరు చేయడంతోపాటు ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా నగదు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

పవన్ కళ్యాణ్‌కు పిచ్చిపట్టింది

వివాహ వ్యవస్థకు భిన్న భాష్యం చెబుతూ, సంప్రదాయాలను గౌరవించని వ్యక్తి జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ అని మంత్రి సురేష్ మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని, కోవిడ్ సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు అండగా నిలిచారని, అటువంటి వారిపై పవన్ నిందలు మోపడం హేయమైన చర్య అన్నారు. పవన్ కళ్యాణ్ పిచ్చిపట్టిన వాడిలా ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ విజయ, తహసీల్దార్ వేణుగోపాలరావు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాసింపీరా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దర్శనం నాగయ్య, సర్పంచ్ చిత్తూరి హారిక, వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మండల నాయకులు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, యక్కంటి లింగారెడ్డి, చిట్యాల యోగిరెడ్డితోపాటు మండల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.